క్లుప్తంగా

ఆలయాభివృద్ధి, అన్నదానానికి విరాళం

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానానికి పలువురు భక్తులు ఆదివారం విరాళం సమర్పించారు. సత్యసాయిజిల్లా పుట్టపర్తికి చెందిన సునంద దేవి ఆలయ అభివృద్ధికి రూ.ఒక లక్ష, అలాగే తమిళనాడు రాష్ట్రం తిరువల్లూరుకు చెందిన శారద భాయ్ రూ. ఒక లక్ష నిత్యాన్నదానంకు అందజేశారు. వారికి ఆలయ అధికారులు, సిబ్బంది ప్రత్యేక దర్శనభాగ్యం కల్పించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

కాపు భవన్ స్థలానికి ఎలాంటి ఆధారాల్లేవ్..!

చిత్తూరు రూరల్(కాణిపాకం): గత టీడీపీ ప్రభుత్వంలో కాపు భవన్‌కు స్థల కేటాయింపు చేశారని, కానీ ఆ భూమికి తమ వద్ద ఎలాంటి ఆధారాలు లేవని కాపు నేతలు పలువురు ఎమ్మెల్యేకు గురజాల జగన్‌మోహన్‌కు నివేదించారు. శ్రీకృష్ణదేవరాయల జయంతి పురస్కరించుకుని చిత్తూరు నాగయ్య కళాక్షేత్రంలోని రాయల విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాలవేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా కాపు నేతలు కాపు భవన స్థలానికి పక్కా ఆధారం ఉండేలా చూడాలన్నారు. కాజూరు చెరువుకు శ్రీకృష్ణదేవరాయల చెరువుగా నామకరణం చేసి అభివృద్ధి చేయించాలన్నారు. భవన నిర్మాణం, అభివృద్ధి పనులకు రూ.50 లక్షలు విరాళం ప్రకటించారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

యోగాతో ఆధ్యాత్మిక వికాసం



మాట్లాడుతున్న యోగాచార్యులు నరేంద్రకుమార్

చిత్తూరు కలెక్టరేట్ : యోగసాధనతో శారీరక, మానసిక, సామాజిక, ఆధ్యాత్మిక వికాసం పొందవచ్చని యోగాచార్యులు నరేంద్రకుమార్ అన్నారు. ఆదివారం స్థానిక తపోవనం వృద్ధాశ్రమంలో ఋషి ప్రభాకర్ గురూజీ 12వ పుణ్యతిథి ఆరాధనోత్సవం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, యోగా ఆరోగ్యం కోసం మాత్రమే కాదని, సాధనతో సంపూర్ణ, సమగ్ర వ్యక్తిత్వ వికాసం కలుగుతుందని చెప్పారు. ప్రభాకర్ గురూజీ ప్రబోధించిన ప్రేమ, సేవాతత్పరతతో సమాజానికి చేతనైనంత మేలు చేయాలన్నారు. వసుధైక కుటుంబ సాధన వైపు ప్రయాణించాలంటే ప్రతి ఒక్కరూ ధ్యానం ఒక వ్యాపకంగా మలచుకోవాలని కోరారు. అనంతరం వృద్ధాశ్రమంలోని అనాథలకు దుస్తులు, పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సహయోగాచార్యులు డాక్టర్ బ్రహ్మయ్య, వలంటీర్లు, ధ్యానులు పాల్గొన్నారు.

తగ్గిన చికెన్ అమ్మకాలు

గుడిపాల: కోస్తా జిల్లాల్లో బర్డ్‌ఫ్లూ ప్రభావం ఇక్కడ కూడా పడింది. రెండురోజులుగా 50 శాతం చికెన్ అమ్మకాలు తగ్గాయని హోల్‌సేల్, రిటైల్ వ్యాపారులు చెప్పారు. జిల్లాలో బర్డ్‌ఫ్లూ ప్రభావం లేనప్పటికీ వినియోగదారులు చికెన్, కోడిగుడ్ల వినియోగం తగ్గించారని ఆదివారం జరిగిన అమ్మకాలు చెప్పకనే చెప్పాయి.

టైరు పంక్చరై బోల్తా



శ్రీరంగరాజపురం : వాహనం బోల్తా పడి ముగ్గురు గాయపడిన ఘటన మండలంలోని మెదవాడ ఎస్టీ కాలనీ వద్ద చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. బంగారుపాళ్యం నుంచి పళ్లిపట్టుకు టాటాఏస్ వాహనంలో సిమెంటు, బండ రాయిని తరలిస్తున్నారు. అయితే మెదవాడ ఎస్టీ కాలనీ చిత్తూరు పుత్తూరు జాతీయ రహదారి వద్ద వాహనం టైర్ పంక్చర్ కావడంతో బోల్తాపడింది. ఇందులో ప్రయాణిస్తున్న ముగ్గురికి స్వల్ప గాయాలు కావడంతో క్షేమంగా బయటపడ్డారు.

ఈరోజు

ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ఐరాల/తవణంపల్లె: తమ కార్యాలయాల్లో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తామని ఐరాల, తహసీల్దార్ మహేష్‌కుమార్, తవణంపల్లె ఎంపీడీఓ రెడ్డిబాబు, తహసీల్దార్ సుధాకర్ తెలిపారు. ప్రజలు అర్జీలు అందజేసి తమ సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు.

బీరప్పచెరువులో ఫ్యామిలీ డాక్టర్

ఐరాల: మండలంలోని బీరప్పచెరువులో సోమవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

ఎమ్మెల్యే పర్యటన

గుడిపాల: మండలంలో సోమవారం చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ పర్యటించనున్నట్లు పంచాయతీరాజ్ అసిస్టెంట్ ఇంజినీర్ ప్రసాద్‌నాయుడు తెలిపారు. నారగల్లు, సీఎం కొత్తయిండ్లు, వెంగమాంబపురం, గొల్లపల్లె, బందార్లపల్లె, రాగిమానుపట్టెడ, మరకాలకుప్పం, గట్రాళ్లమిట్ట, మందిక్రిష్ణాపురం గ్రామాల్లో సీసీరోడ్ల ప్రారంభోత్సవం, కుప్పిగానిపల్లెలో గ్రామ సచివాలయం, 197రామాపురంలో గ్రామ సచివాలయం పరిధిలో ప్రహరీ గోడను ప్రారంభిస్తారని తెలియజేశారు.

లంచం ఇస్తేనే సర్టిఫికెట్..!

తహసీల్దార్ కార్యాలయంలో వివిధ సర్టిఫికెట్ల మంజూరులో తీవ్ర జాప్యం చోటుచేసుకుంటోంది. పదిరోజులైనా ఇవ్వకపోవడంతో ప్రదక్షిణలు చేయడానికే సరిపోతోందని ప్రజలు వాపోతోన్నారు. గత ప్రభుత్వ పాలనలో సచివాలయంలో ఎలాంటి సర్టిఫికెట్ కోసమైనా దరఖాస్తు చేసుకుంటే రెండురోజుల్లో లబ్ధిదారుల సెల్‌ఫోన్లకు మెసేజ్‌లు వచ్చేవి. ఇప్పుడా పరిస్థితి లేదు. చేయి తడిపితేనే సర్టిఫికెట్లు ఇచ్చే పరిస్థితి దాపురించిందని మరోవైపు లబ్ధిదారులు గగ్గోలు పెడుతున్నారు.

- అవస్థలు పడుతున్న లబ్ధిదారులు
- రుణాల కోసం దరఖాస్తు చేసుకోలేకపోతున్నామని గగ్గోలు
- ఇదీ తహసీల్దార్ కార్యాలయం కథా కమామీషు



గుడిపాల తహశీల్దార్ కార్యాలయం

గుడిపాల: ప్రభుత్వం వివిధ కార్పొరేషన్ల రుణాలకు దరఖాస్తులు చేసుకోవాలని ప్రకటించడంతో బీసీ రుణాల కోసం వందలాది మంది ఇన్‌కం, కులం, రెసిడెన్షియల్ సర్టిఫికెట్ల కోసం సచివాలయంలో దరఖాస్తులు చేసుకున్నారు. ఇందుకుగాను డిజిటల్ అసిస్టెంట్ ఆన్‌లైన్‌లో ఉంచి దరఖాస్తును సంబంధిత వీఆర్‌ఓకు పంపుతున్నారు. గతంలో వీఆర్‌ఓలు ఆయా సచివాలయాలకు రోజూ వచ్చి వెళ్తూ ఉండేవారు. ఇప్పుడు వారు ఎప్పుడు ఎక్కడ ఉంటారో తెలియని పరిస్థితి. ఒకవేళ వచ్చినా సచివాలయ ఆవరణకు వచ్చి ఫేస్ యాప్‌లో అటెండెన్స్ వేసుకొని తిరిగి తహసీల్దార్ కార్యాలయాలకు వెళ్లిపోతున్నారు. సర్టిఫికెట్లకు సంబంధించిన దరఖాస్తులు లబ్ధిదారులే తీసుకువెళ్లాల్సి వస్తోంది. ఒకవేళ తీసుకువెళ్లపోతే వారం తరువాత సెల్‌ఫోన్‌కు సర్టిఫికెట్ రిజెక్ట్ అని మెసేజ్ వస్తోందని మండలంలో పలువురు లబ్ధిదారులు వాపోతున్నారు. కార్యాలయానికి సర్టిఫికెట్లు వచ్చినట్లయితే వీఆర్‌ఓ, ఆర్‌ఐ, డెప్యూటీ తహశీల్దార్ల లాగిన్ నుంచి పుటప్ కావాల్సి ఉంది.ఈ తతంగం అంతా చేయాలంటే లబ్ధిదారులు చేయి రెవెన్యూ ఉద్యోగుల చేయి తడపాల్సి వస్తోంది. ఇక ఈ సర్టిఫికెట్లను అన్ని లాగిన్ల నుంచి క్లియర్ చేసినట్లయితే సీనియర్ అసిస్టెంట్ల వద్ద ఆగిపోతోంది. వారు వాటన్నింటిని రికార్డులో నమోదు చేసి తహసీల్దార్ వద్దకు వెళ్లి సంతకం చేస్తేనే సర్టిఫికెట్ అప్రూవల్ అవుతుంది. ఈ తతంగం అంతా పూర్తవడానికి పది రోజుల పైచిలుకు పడుతోంది. ఇక, చేయి తడిపితే మాత్రం సర్టిఫికెట్లు ఎలాంటి జాప్యం లేకుండా మంజూరు చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. లేనిపక్షంలో సర్టిఫికెట్స్ రిజెక్ట్ అని లబ్ధిదారునికి మెసేజ్ వస్తోందని, దీనిపై ప్రశ్నిస్తే ఉద్యోగులు సమాధానం చెప్పడం లేదని కొందరు లబ్ధిదారులు చెప్పారు. సర్టిఫికెట్ల కోసం లంచాల బాధ పడలేక చాలామంది లబ్ధిదారులు బీసీరుణాల కోసం దరఖాస్తులు కూడా చేసుకోలేదు.

ఎక్కడికి వెళ్లినా లంచం

గ్రామాల్లో భూములను సర్వే చేయాలంటే ముందుగానే కొంత లంచం ఇచ్చుకోవాల్సి వస్తోందని, ఇవ్వనిపక్షంలో..తమకు టైం లేదని, 20 రోజులు పడుతుందని గ్రామ సర్వేయర్లు చెబుతున్నారని తెలియవచ్చింది. సమస్యను తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం శూన్యమని వాపోతున్నారు. దీంతో రెవెన్యూ ఉద్యోగులంటేనే లంచావతారులు అనే ముద్ర పడుతోంది. ఈ అవినీతి బాగోతంపై విసిగి వేసారిన కొందరు రైతులు జిల్లా ఉన్నతాధికారులకు పూర్తి ఆధారాలతో ఫిర్యాదు చేసేందుకు సిద్ధమయ్యారని ప్రచారంలోకి వచ్చింది.

రీ-సర్వేలో రైతన్నల సర్వే నంబర్లు మాయం!

గతంలో చేసిన రీ-సర్వే గ్రామాల్లో చాలామంది రైతన్నల సర్వే నంబర్లు కనిపించడం లేదు. రైతులు వెళ్లి సంబంధిత వీఆర్‌ఓలు, సర్వేయర్లను సంప్రదిస్తే.. సర్వేకు నగదు కడితే వచ్చి పరిశీలిస్తామని చెబుతున్నారు. ఇలా మండలంలో వందలాది మంది రైతుల సర్వే నంబర్లను అధికారులు ఎగ్గొట్టేశారు! గత సంవత్సరం అక్టోబర్, డిసెంబర్‌లో జరిగిన గ్రామసభల్లో కూడా వందలాది మంది రైతులు అర్జీలను సమర్పించారు. ఇంతవరకు ఒక్క అర్జీని కుడా పరిష్కరించిన పాపానపోలేదు. గతంలో రీ-సర్వేల్లో రైతులను పిలిపించి చేయాల్సిన సర్వేలను వారికి తెలియకుండానే గ్రామ సచివాలయ సర్వేయర్లు వారంతట వారే ఇష్టానుసారంగా సర్వేలు చేసి తప్పుల తడకలు చేశారు. దీంతో గ్రామాల్లో సర్వేయర్లదే ఇష్టారాజ్యమైంది.

కనీస వేతనాలు ఇవ్వాలి

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న స్వీపర్లకు కనీసవేతనాలు ఇవ్వాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం ఏఐటీయూసీ కార్యాలయంలో జిల్లా స్కూల్ స్వీపర్స్ యూనియన్ 2వ మహాసభ నిర్వహించారు. యూనియన్ రాష్ట్ర, జిల్లా అధ్యక్షురాలు జయకుమారి, మంజుల మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న స్వీపర్లు, వాచ్‌మెన్లకు కనీస వేతనం ఇచ్చి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలు విడుదల చేయాలన్నారు. పాఠశాలల శుభ్రతకు వినియోగించే చీపురుకట్టలు, సోపులు, ఫినాయిల్, గ్లౌవ్స్, చెప్పులు ఇవ్వాలన్నారు. అలాగే యూనిఫాం, గుర్తింపు కార్డులు మంజూరు చేయాలన్నారు. రాజకీయ వేధింపులకు స్వస్తి పలకాలని, అకారణంగా విధుల నుంచి తొలగించిన వారిని తిరిగి చేర్చుకోవాలని డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించకపోతే సంఘటిత పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య, జిల్లా గౌరవాధ్యక్షులు నాగరాజు, నాయకులు దాసరి చంద్ర, గోవిందస్వామి, రమాదేవి, విజయ్ కుమార్, ప్రభావతి, మంజుల, రాధ, లక్ష్మి, తులసి, కోకిల, ఇందిర, మమత, ఆశ, సంధ్య తదితరులు పాల్గొన్నారు.



కనీస వేతనాల కోసం డిమాండ్ చేస్తున్న నాయకులు

ఎటుచూసినా పచ్చదనమే!



పాపసముద్రం వద్ద పచ్చదనంతో వరి పంట

గుడిపాల: మండలంలోని పాపసముద్రం, పిళ్లారికుప్పం, అడవిచేను, బండపల్లె, చిత్తపార, గుడిపాల ప్రాంతాల్లో ఎటువైపు చూసినా పచ్చదనం కనిపిస్తోంది. రైతన్నలు విరివిగా వరి సాగుచేశారు.ఈ రబీ సీజన్‌లో 983 హెక్టార్లలో వరి సాగు చేశారు. గతంలో పంటలు చేయకుండా మానేసిన రైతులు కూడా ఈసారి వరి సాగు చేయడం గమనార్హం!

బస్.. పుస్స్‌స్స్‌స్స్..!



నేంద్రగుంటలో పంక్చర్ షాపు ముందు ఉన్న ఆర్టీసీ బస్సులు

బస్సెనక బస్సు వచ్చి
పంక్చర్‌తో ప్రయాణం కుస్తీ
ఇంకే బస్సు వస్తుంది కొడుకో

అని ప్రయాణికులు కస్సుబుస్సుమన్నారు. ఇక తిరుపతికి చేరేకాడికి ఏటైమవుతుందో సామీ అని నిట్టూర్చారు. ఆదివారం సాయంత్రం పుంగనూరు-తిరుపతి పల్లెవెలుగు సర్వీసు పాకాల బస్టాండ్‌కు 4.30 గంటల సమయంలో వచ్చింది. అప్పటికే పడిగాపులు కాస్తున్న జనం పోలోమంటూ బస్సు ఎక్కారు. బస్సులో సీట్లు లేక నిలబడి ప్రయాణిస్తున్న వారికితోడు పాకాల జనంతో బస్ ఫుల్ అయ్యింది. బస్ ఇరంగారిపల్లె దాటిన కొన్ని క్షణాలకే పుస్స్‌స్స్‌స్స్‌స్స్..మంటూ శబ్దం వస్తూండడంతో డ్రైవర్ అనుమానించి బస్సు సైడుకు ఆపి, దిగి టైర్లు చెక్ చేశాడు. ఎడమవైపు వెనుక టైర్ పంక్చరై గాలిపోతున్నట్టు గుర్తించాడు. దీంతో ప్రయాణికులు దీలా పడ్డారు. పంక్చరేపిచ్చుకుని పోదాం అని డ్రైవర్ మళ్లీ బస్సు స్టార్ట్ చేశాడు. అక్కడ నుంచి రెండు కిలోమీటర్ల దూరంలోని నేంద్రగుంట సమీపంలోని ఓ షాపు వద్ద నిలిచి ఉన్న ఓ బస్సు వెనుక ఆపాడు. దీంతో ముందరి బస్సులోని ప్రయాణికులు, కండక్టర్ రయ్‌మంటూ బస్సు వద్దకు వచ్చారు. స్నేప్! వీళ్లందర్నీ ఎక్కించుకోనా!? మా బస్సు పంక్చరైంది. ఈడ పంక్చరేపిచ్చేకాడికి లేటవుతుందని ఆ బస్సు కండక్టర్ చెప్పాడు. ఏంబా! మా బస్సు పంక్చరైంది..అందుకే మీ బస్సు ఎనక ఆపినం. ఈ షాపులో పంక్చరేపిచ్చేదానికి అని కండక్టర్ చెప్పేకాడికి ఒకరి ముఖాలు ఒకరి చూసుకున్నారు. మీదీ సేమ్ కేసేనా! అనేసరికి ప్రయాణికులకు నిట్టూరుస్తూ కిందకు దిగారు. ఇలా ముప్పావు గంట వ్యవధిలో పుంగనూరు-తిరుపతి సర్వీసులు రెండు పంక్చరై, రెండూ ఒకే షాపు వద్దకు పంక్చర్ వేయించుకోవడానికి చేరుకోవడం అక్కడి వారికి ఆసక్తి కలిగించింది. ఒకరిద్దరు ప్రయాణికులు నేంద్రగుంట హైవేకు వెళ్లి చిత్తూరు - తిరుపతి ఆర్టీసీ బస్సు ఎక్కారు.

–పాకాల

శ్రీకృష్ణదేవరాయల కీర్తి... నేటి తరానికి స్ఫూర్తి

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి
- చిత్తూరులో ఘనంగా శ్రీకృష్ణదేవరాయల జయంతి వేడుకలు



చిత్తూరు రూరల్ (కాణిపాకం): విగ్రహానికి నివాళులర్పిస్తున్న విజయానందరెడ్డి, బలిజనేతలు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): శ్రీకృష్ణదేవరాయల కీర్తి..నేటి తరానికి స్ఫూర్తి అని వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి అన్నారు. విజయానందరెడ్డి దాతృత్వంలో చిత్తూరు నగరం గంగినేని పార్కులో ఏర్పాటు చేసిన శ్రీకృష్ణదేవరాయల విగ్రహం వద్ద ఆదివారం బలిజ సంఘ నేతలు వివేకానంద రవి ఆధ్వర్యంలో జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా విజయానందరెడ్డి హాజరై విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి పూజలు చేశారు. అనంతరం కేక్ కట్ చేసి మీడియాతో మాట్లాడారు. శ్రీకృష్ణదేవరాయలు తెలుగువారి ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెప్పారన్నారు. రాయలు తన పరిపాలనలో ప్రజలకు పూర్తిస్థాయిలో న్యాయం చేస్తూ గొప్ప పరిపాలకుడిగా పేరు తెచ్చుకున్నారన్నారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా బలిజ నేతలు చిత్తూరు అభివృద్ధికి పాటుపడాలన్నారు. అనంతరం బలిజ నేతలు మధుసూదన్ రాయల్, రవినాయుడు మాట్లాడారు. రాయల కట్టడాలు చరిత్రకెక్కాయని స్మరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు కేపీ శ్రీధర్, మండల కన్వీనర్ జయపాల్, నేతలు అప్పాజి, రమణ, రెడ్డెప్ప, రవినాయుడు, శివప్రసాద్, బాబు ప్రసాద్, సురేష్, ప్రశాంత్, జైకుమార్, గిరినాయుడు, వైస్ ఎంపీపీ జయరాం తదితరులు పాల్గొన్నారు.



అరగొండలో..

అరగొండలో..

తవణంపల్లె: మండలంలోని అరగొండ పాత బస్టాండులో ఆదివారం శ్రీకృష్ణదేవరాయుల 555వ జయంతిని పైమాఘం శ్రీకృష్ణదేవరాయుల బలిజ సంఘం ఘనంగా నిర్వహించింది. రాయలు విగ్రహానికి పాలాభిషేకం, పూజలు చేశారు. గజమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను కీర్తించారు. గిరీష్, మోహన్, ఈశ్వర్ శెట్టి, నారాయణ, గోవిందశెట్టి, గోపాల్‌శెట్టి, వెంకటేష్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కోలాహలంగా ఎడ్ల పందేలు

పలమనేరు: పలమనేరు మండలంలోని కొలమాసనపల్లిలో ఆదివారం మైలేరు పండుగను ప్రజలు కోలాహలంగా నిర్వహించారు. ఇక్కడ ఏటా ఆనవాయితీగా మైలేరు (ఎడ్ల పందాలు)ను నిర్వహిస్తారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన పోటీ ఎద్దులను ప్రభలతో అలంకరించి గ్రామ నడివీధిలో పరుగెత్తించారు. యువత కేరింతలు కొడుతూ ఎడ్లను నిలువరించేందుకు ఉత్సాహం చూపారు. ఎక్కువ వేగంగా వెళ్లిన ఎద్దులకు బహుమతులను నిర్వాహకులు అందజేశారు. చుట్టు పక్కల గ్రామాలకు చెందిన వారేకాకుండా అటు తమిళనాడు, ఇటు కర్ణాటక రాష్ట్రాలకు చెందిన పలువురు తరలివచ్చారు.

ఉరకలేసిన ఉత్సాహం

బైరెడ్డిపల్లె: మండల కేంద్రంలోని పెద్దచెరువు సమీపంలో ఉన్న రహదారిలో ఆదివారం నిర్వహించిన మైలేరు పండుగ ప్రశాంతంగా ముగిసింది. మండల పరిధిలో నుంచే కాక తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి పశువులన్నీ ఈ పరుగుపందేనికి తీసుకువచ్చారు. భారీ జనసందోహం మధ్య పశువులు పరుగులు తీస్తుంటే యువత ఉత్సాహానికి హద్దుల్లేవు. దూసుకెళుతున్న పశువులను నిలువరించేందుకు యువకులు ఉత్సాహం చూపారు. గెలుపొందిన పశువులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.



బైరెడ్డిపల్లె మైలేరులో దూసుకుపోతున్న పశువులు

వరసిద్ధునికి విరాళం

కాణిపాకం: శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానానికి భక్తులు ఆదివారం విరాళం సమర్పించారు. సత్యసాయి జిల్లా పుట్టపర్తికి చెందిన సునంద దేవి ఆలయ అభివృద్ధికి రూ.ఒక లక్ష, తిరువళ్లూరుకు చెందిన శారదభాయ్ రూ. ఒక లక్ష నిత్యాన్నదానానికి అందజేశారు.

IN THE COURT OF THE V ADDL CIVIL JUDGE (JUNIOR DIVISION) CUM JUDICIAL FIRST CLASS MAGISTRATE FOR MOBILE :: CHITTOOR
O.S.NO.42 OF 2024
Between:
M.Sasirekha ...Plaintiff
And:
J.S.Sreenivas ...Defendant
SUIT SUMMONS TO DEFENDANT
J.S.Sreenivas,
S/o. J.Sai Prasad
Hindu, aged about 48 years, Business
R/at D.no.8-215, Santhapeta,
Chittoor Town and District-AP
Sir, Please take notice that the above suit filed by plaintiff against you for recovery of the suit pronote amount with interest and costs of the suit stands posted on 26-03-2025 for your appearance. If you do not appear on the above date at 10.30 A.M. either in person or through an advocate, the matter will be decided exparte.
Sd/- G.CHENNAKESAVULU NAIDU
Advocate for the Plaintiff
Chittoor 15-02-2025

పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తాం



పూర్వ ఉపాధ్యాయులతో విద్యార్థులు

వెదురుకుప్పం : 40 ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థులు అందరూ ఒకచోట కలవడం ఓ అద్భుతం అని పూర్వ విద్యార్థుల రిటైర్డు ఉపాధ్యాయులు అన్నారు. మండలంలోని వెదురుకుప్పం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల 1984-1985 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థి దశ చాలా కీలకం అని, నాడు తాము విద్యను బోధించిన విద్యార్థులు నేడు తహసీల్దారుగా, డాక్టర్లుగా, బిల్డర్లుగా, పారిశ్రామికవేత్తలుగా, ప్రభుత్వ ఉద్యోగులుగా వివిధ రంగాల్లో స్థిరపడి ఉన్నత స్థానాలకు ఎదగడం తమకు గర్వంగా ఉందన్నారు.

పది మందికి సహాయపడి మీరు ఎదిగిన తీరు నేటి యువతకు ఆదర్శంగా ఉండాలన్నారు. అనంతరం విద్యార్థులు మాట్లాడుతూ ఉపాధ్యాయులు నేర్పిన నైతిక విలువలు, చదువు, వారి ప్రేరణ తమ ఉన్నతస్థితికి ఎంతగానో ఉపయోగపడిందన్నారు. తాము ఈ స్థితికి రావడానికి కృషి చేసిన ఉపాధ్యాయులను స్మరించుకుని సన్మానించడం చాలా ఆనందంగా ఉందన్నారు. అనంతరం భారీ కేక్ కట్ చేసి, ఉపాధ్యాయులను సన్మానించి, జ్ఞాపికను అందజేశారు.

విజేతలకు బహుమతుల పంపిణీ



విజేతలకు జ్ఞాపికతో పాటు నగదు బహుమతి అందజేస్తున్న పూర్వవిద్యార్థులు

బైరెడ్డిపల్లె: గంగజాతర సందర్భంగా పూర్వవిద్యార్థుల ఆధ్వర్యంలో నిర్వహించిన వాలీబాల్ పోటీల్లోని విజేతలకు నిర్వాహకులు నగదు బహుమతులు అందజేశారు. వాలీబాల్ పోటీల్లో 25 జట్ల వరకు హోరాహోరీగా తలపడ్డాయి. మొదటి బహుమతిగా కోలార్ టీమ్ - రూ.50,116, రెండవ బహుమతిగా వేలూరు డేంజర్‌బాయ్స్ టీమ్ - రూ.30,116, మూడవ బహుమతిగా పాండిచ్చేరి టీమ్ - రూ.20,116, నాలుగో బహుమతిగా తమిళనాడు ముత్తూరు టీమ్ - రూ.10,116 కైవసం చేసుకున్నారు. పూర్వవిద్యార్థులు శేఖర్‌గౌడు, లియాఖత్ ఆలీ, విద్యాసాగర్‌రెడ్డి, హనుమంతురెడ్డి, ప్రవీణ్ జ్ఞాపకార్థం ప్రతి ఏటా గంగజాతర సందర్భంగా వాలీబాల్ నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. చుట్టు ప్రక్కల ప్రాంతాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి వాలీబాల్ పోటీలను తిలకించారు.